సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

కృష్ణాష్టమి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పిల్లలను కృష్ణుడి వేషధారణలో అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోయారు. 9లో



ఉప్పొంగిన వాగులు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజాము వరకు కుండపోతగా వర్షం కురవగా వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 24°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా బాలాజీ కల్యాణం




కల్యాణానికి ముస్తాబైన స్వామి, అమ్మవార్లు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ వేడుక అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన వెలది భాస్కర్‌రావు – రమాకుమారి దంపతులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పి.వి.రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రెండు గేట్లు ఎత్తివేత

కిన్నెరసాని నుంచి 10వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి..




కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 14వేల క్యూసెక్కుల వరద రావడంతో శనివారం నీటిమట్టం 404.60 అడుగులకు పెరిగింది. దీంతో రెండు గేట్లను ఐదడుగుల మేర ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

పర్యాటకులకు బ్రేక్..

కాగా, శనివారం సెలవురోజు కావడంతో కిన్నెరసాని జలాశయాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. అయితే లోపలికి అనుమతించకుండా ప్రధాన ద్వారం గేటు మూసివేయడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



నామినేషన్ దాఖలు చేస్తున్న ఏఈలు

పాల్వంచ: టీజీ జెన్‌కో పరిధిలోని తెలంగాణా స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం కోలాహలంగా ప్రారంభమైంది. రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ఎన్నికలు రాష్ట్రంలోని సుమారు 25 ప్రాంతాల్లో ఈనెల 30న నిర్వహించనుండగా.. 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఓట్ల లెక్కింపు మాత్రం అసోసియేషన్ హెడ్ క్వార్టర్ అయిన కేటీపీఎస్‌లో సెప్టెంబర్ 2న చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఏఈలు సుమారు 2వేల మంది ఓటు వేసే అవకాశం ఉంది. అయితే తొలిరోజు కేటీపీఎస్ ఐదో దశకు చెందిన ఏఈ జి.కీర్తి ఫైనాన్స్ సెక్రటరీ పదవికి, 7వ దశకు చెందిన ఏఈ పి.నవీన్ జాయింట్ సెక్రటరీ(థర్మల్) పదవికి నామినేషన్లు దాఖలు చేశారు. 18, 19 తేదీల్లో మిగితా పోస్టులకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. తొలిరోజు నామినేషన్ల కార్యక్రమంలో ఎన్నికల అధికారి రవి, మహేష్, లింగ నాయక్, ప్రకాష్, ప్రశాంత్, అఖిలేష్, వాహిని, రమేష్, మంజూషా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందాలు చూద్దాం.. ఆస్వాదిద్దాం

కొత్తదనం సంతరించుకున్న పులిగుండాల

- ఘాట్‌రోడ్డులో ప్రయాణం.. సఫారీపై స్వారీ
- అరుదైన పక్షులు, ఔషధ మొక్కలకు ఆలవాలం
- ఉమ్మడి జిల్లా వాసులకు అందుబాటులో పర్యాటక కేంద్రం



అందాలతో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టు

సండే స్పెషల్

సత్తుపల్లి: కనుచూపు మేర పచ్చని చెట్లు.. చల్లనిగాలులు.. పక్షుల కిలకిలారావాలు.. జాలువారే జలపాతాలు.. ఘాట్‌రోడ్‌పై వెళ్తుంటే మార్గమధ్యలో ఆలయాలు.. దూరంగా ఉమ్మడి జిల్లాకు సరిహద్దుగా కనిపించే కనిగిరి గుట్టలు.. అక్కడక్కడా అరుదైన నీలిరంగు పుట్టగొడుగులు, ఔషధ మొక్కలు.. ఈ అనుభూతులన్నీ మీ సొంతం కావాలంటే ఒక రోజు సమయం కేటాయించండి చాలు! ఎంతో దూరం వెళ్లాల్సిన పనికూడా లేదు. కుటుంబ సమేతంగా పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తే మరిచిపోలేని అనుభూతులను మూటగట్టుకుని రావొచ్చు! ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజంలో భాగంగా రూ.4.20కోట్ల నిధులతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెండు జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి.పాటిల్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, అటవీ శాఖ భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ మంజుల తరచూ పర్యవేక్షిస్తుండడంతో పర్యాటకులకు ఒక్కటొక్కటిగా సౌకర్యాలు సమకూరుతూ ఉమ్మడి జిల్లా వాసులకు కొత్త పర్యాటక కేంద్రం అందుబాటులోకి వచ్చినట్లయింది.

మనస్సును ఆహ్లాదపరిచేలా..


పులిగుండాల ప్రాజెక్టు వద్దకు వెళ్తే అన్ని బాధలు, కష్టాలు మరిచిపోవడమే కాక మనస్సు ఆహ్లాదంగా మారుతుంది. మార్గమధ్యలో ఎలుగుబంటి, దుప్పులు, కణుజులు, అడవిపిల్లులు, జంగుపిల్లులు, పూనుగు పిల్లులు, మూషిక జింక, నెమళ్లను చూడొచ్చు. సముద్ర మట్టానికి 700 అడుగుల ఎత్తులో నిర్మించిన లియోపార్డ్ టవర్ నుంచి చూస్తే అటవీ అందాలతో పాటు చిరుతపులి కదలికలూ అప్పుడప్పుడు కనిపిస్తాయి.

ప్రత్యేక బస్సు.. అడ్వాన్స్ బుకింగ్


పులిగుండాల ప్రాజెక్టు సందర్శన కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. ప్రతీ శని, ఆదివారం వి.ఎం.బంజరు బస్టాండ్ నుంచి అటవీశాఖ ఏర్పాటు చేసిన బస్సులు ఉదయం 9, 9.30 గంటలకు, కల్లూరు బస్టాండ్ నుంచి 11, 11.30 గంటల సమయాన బయలుదేరి రామకృష్ణాపురం వరకు వెళ్తాయి. బ్రహ్మళ్లకుంట ముఖద్వారం నుంచి అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారి వాహనంలో ప్రయాణిస్తూ అటవీ అందాలను తిలకించవచ్చు. టికెట్ ధర పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా నిర్ణయించారు. అలాగే, 94412 18466 నంబర్ ద్వారా అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యమూ కల్పించారు. సొంత వాహనంలో వచ్చే పర్యాటకులు సఫారీ వాహనంలోనే వెళ్లాల్సి ఉంటుంది.

27 కిలోమీటర్ల ప్రయాణం

పెనుబల్లి మండలం బ్రహ్మళ్లకుంట ముఖద్వారం నుంచి 27 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డులో అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారి వాహనంలో ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. అటవీశాఖ అభివృద్ధి చేసిన హట్లతో విశ్రాంతి తీసుకునే అవకాశముంది. ఎవరూ ఇబ్బంది పడకుండా టాయిలెట్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. మూడు వాచ్ టవర్లు, సెల్ఫీపాయింట్, రాత్రి బసకు నైట్ క్యాంపింగ్ సైట్, సోలార్ బోరు ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన రిసెప్షన్‌హట్(భోజనశాల), అటవీ ఉత్పత్తుల విక్రయ స్టాల్ కూడా ఉంది. కాగా, చండ్రుగొండ మండలం బెండాలపాడు సమీపాన కనిగిరి గుట్టలపై 11వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు నిర్మించిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం.. అక్కడ మోటబావిని కూడా చూడొచ్చు. అలాగే, పులిగుండాల ప్రాజెక్టు సమీపాన శివాలయంలో పూజలు చేసే అవకాశముంది.



జాలువారుతున్న జలపాతం..



చిరుతను చూసేలా లియోపార్డ్ టవర్



బ్రహ్మళ్లకుంట వద్ద ముఖద్వారం



అటవీశాఖ బస్సు



పులిగుండాల ప్రాజెక్టులో బోటుషికారు

బాధ్యతాయుతంగా పనిచేయండి

- సీఎం పర్యటన ఏర్పాట్లలో లోపాలుంటే సహించం
- అధికారులకు కలెక్టర్ పాటిల్ హెచ్చరిక



సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు

చండ్రుగొండ : ఈ నెల 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సదుపాయాల కల్పనలో ఎలాంటి లోపాలున్నా సహించబోమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. చండ్రుగొండ మండలం బెండాలపాడులో శనివారం ఆయన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం పర్యటన పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు ఇక్కడే పని చేయాలని, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు పరిమిత సంఖ్యలోనే ఇతరులను గ్రామంలోకి అనుమతిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారుల గృహప్రవేశాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వారికి దుస్తులు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం సీఎం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

హెలీప్యాడ్, సభాస్థలి సందర్శన..

చండ్రుగొండలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్, బహిరంగ సభ స్థలాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. వర్షం వస్తే ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సీఎం కాన్వాయ్, ఇతర వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, డీఎస్పీ అబ్దుల్ రహెమాన్, సీఐ విజయలక్ష్మి, ప్రత్యేకాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు..

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వినతులు ఇచ్చేందుకు రావొద్దని కోరారు.

జిల్లాకు రెడ్ అలర్ట్...

కొత్తగూడెం అర్బన్ : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. సాయంత్రం వేళలో వాగులు, పొలాల వద్దకు వెళ్లొద్దని కోరారు. ప్రమాదాల సమయంలో సాయం అవసరమైతే ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08744 – 241950, వాట్సాప్ నంబర్ 93929 19743, భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08743 – 232444, వాటాప్ నంబర్ 93479 10737, ఐటీడీఏ కార్యాలయంలోని 79952 68352 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్లు అందించాలి

- సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశం
- సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులు, నేతలతో సమావేశం



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్, హాజరైన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్లు అందించాలని సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సీఎంపీఎఫ్ రీజియన్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన వంశీధర్ కుసుంభ శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగులు గతంలో ఏమైనా రుణాలు తీసుకుని ఉంటే నెల రోజుల ముందుగానే వాటిని క్లియర్ చేసుకోవాలని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు అప్‌డేట్ చేయాలని, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. అంతకుముందు సంస్థ ప్రధాన కార్యాలయంలో బలరామ్ అధ్యక్షతన సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డ్ సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన నాలుగు ట్రస్టీలకు సంబంధించిన పోస్ట్ రిటైర్మెంట్ కాంట్రిబ్యూటరీ మెడికల్ స్కీమ్ –నాన్ ఎగ్జిక్యూటివ్ (సీపీఆర్ఎంఎస్– ఎన్ఈ)లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు మారిన ట్రస్ట్ సభ్యుల స్థానంలో కొత్తవారిని నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణరావు, డైరెక్టర్ (పీపీ) కె.వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. నిత్య కల్యాణ వేడుకలో జంటలు అధిక పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వరుస సెలవులు రావడంతో భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిలాడాయి. పుణ్య స్నానాలు ఆచరించే భక్తులతో పాటు పెరుగుతున్న గోదావరిని తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గోదావరి తీరంలో సందడి వాతావరణం నెలకొంది.

అథారిటీతోనే అభివృద్ధి

- ఆశించినస్థాయిలో పురోగతి లేని భద్రాచలం
- శ్రీ సీతారామచంద్రస్వామి వారి భక్తులకు నిత్యం తిప్పలే
- మౌలిక సదుపాయాల కొరతతో స్థానికులకూ తప్పని పాట్లు



భద్రాచలం పట్టణ వ్యూ

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడంతో భద్రాచలంలో అభివృద్ధి ముందుకు సాగడం లేదు. శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, పట్టణం కలిపి లేదా విడివిడిగా ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. భద్రాచలం పట్టణానికి దశాబ్దాల చరిత్ర ఉంది. బ్రిటీష్, నైజాంల కాలంలో నదీ రవాణాకు అనుకూలంగా ఉండడం, రామయ్య కొలువై ఉండడంతో క్రమంగా పట్టణం విస్తరించగా.. జనాభా ప్రస్తుతం లక్ష వరకు చేరింది. అయితే అభివృద్ధిలో మాత్రం జీరోగానే ఉంది. మేజర్ గ్రామపంచాయతీగా వార్షికాదాయం ఎక్కువగానే ఉంది. అయినా వర్షాకాలంలో చినుకుపడితే రోడ్లన్నీ జలమయంగా మారుతాయి. అస్తవ్యస్తమైన డ్రైనేజీ, భవన, రోడ్ల నిర్మాణానికి సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇష్టానుసారీతిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ క్రమంలో పట్టణాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉంది. మరోవైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజనతో భద్రాచలం విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రభుత్వ స్థలాలకు కొరత ఏర్పడింది. దీంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఒకే చోట సమీకృత భవనం నిర్మించాలని, తద్వారా ఖాళీ స్థలాలను భక్తుల వసతి, ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

సత్వర అభివృద్ధి కావాలంటే..

భద్రాచలం దేవస్థానం అభివృద్ధి సైతం ముందుకు సాగడం లేదు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా.. అది మాడ వీధుల విస్తరణ వద్దే ఆగిపోయింది. కొద్ది నెలల క్రితం బడ్జెట్‌లో యాద్రాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.100 కోట్లను ప్రభుత్వం ప్రకటించింది. కానీ భద్రాచలానికి డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగర అభివృద్ధికి స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసిన తరహాలో భద్రాచల పట్టణం, దేవస్థాన అభివృద్ధికి టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అథారిటీ ఏర్పాటు పర్యాటకాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని చెబుతున్నారు. తగిన సదుపాయాలు కల్పిస్తే ఏజెన్సీలో జలపాతాలు, పాపికొండలకు సందర్శకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

భద్రాచలానికి న్యాయం చేయాలి




భద్రాచలం అభివృద్ధిలో నానాటికీ వెనుకబడిపోతోంది. అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో వర్షాకాలంలో అందరం ఇబ్బంది పడుతున్నాం. పట్టణాన్ని ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రభుత్వం టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి.

–కందుల రాము, స్థానికుడు

జోరువానలో మూడుగంటలు శ్రమించి..

బాలికల గురుకులానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



గురుకుల పాఠశాలలో అర్ధరాత్రి వేళ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

బూర్గంపాడు: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం రాత్రి 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిలై సరఫరా నిలిచిపోయింది. దీంతో హాస్టల్, తరగతి గదుల్లో అంధకారం అలుముకుంది. ఓ పక్క జోరువాన.. మరోవైపు చిమ్మచీకటిలో దోమల దండయాత్ర సాగించాయి. సుమారు 400 మందికి పైగా బాలికలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు తమ పరిస్థితిని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో జోరువానను సైతం లెక్కచేయకుండా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కాంట్రాక్టర్లు సతీష్, కేదారేశ్వరరెడ్డి సహకారంతో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తెప్పించారు. అయితే పాఠశాల ఆవరణ మొత్తం వర్షానికి బురదమయంగా మారడంతో ట్రాక్టర్ దిగబడిపోయింది. మరో ట్రాక్టర్‌ను తెప్పించి మూడు గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో బూర్గంపాడు విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ కనుకు సత్యనారాయణ, రామకృష్ణ, లైన్‌మెన్‌లు జిలాని, భాస్కర్, ప్రదీప్, వెంకన్న, ప్రసాద్ ఎంతగానో శ్రమించారు.

కీలక పదవులు ఖాళీ...

- జలవనరుల శాఖలో అధికారుల కొరత
- ఉమ్మడి జిల్లాలో ఖాళీగా 8 ఈఈ పోస్టులు

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జలవనరుల శాఖను అధికారుల కొరత వేధిస్తోంది. కీలక ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉండడంతో సాగునీటి పంపిణీ పర్యవేక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొంతకాలంగా అధికారులు రిటైర్ అవుతుండగా.. ఆ స్థానాలను భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం 8 ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కీలకమైన సమయమిది...


ఓవైపు వానాకాలం పంటల సాగు ముమ్మరంగా సాగుతోంది. భారీ వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఈ సమయాన సాగునీటి సరఫరా, పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన అధికారులు లేకపోవడంతో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. మరోపక్క కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడి వారు అసహనికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

సీఈ పోస్టూ ఖాళీనే...

ఖమ్మం జలవనరుల శాఖ సీఈ పోస్టు కూడా కొద్దినెలలుగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం సూర్యాపేట సీఈ రమేష్‌బాబు ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాక పాలేరు, మధిర, కల్లూరు ఈఈ పోస్టులు, ఖమ్మం డీసీఈ, కల్లూరు డిప్యూటీ ఎస్ఈ పోస్టులూ మార్చి నుంచి ఖాళీగానే ఉన్నాయి. మరోపక్క కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం డివిజన్లలో ఈఈ, డీఎస్‌సీ పోస్టులు కూడా ఇటీవల పదోన్నతుల కారణంగా ఖాళీ అయ్యాయి. ఈ మేరకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం జలవనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

‘ప్రజాయోధుడు’ పుస్తకావిష్కరణ

రచయిత ఇల్లెందుకు చెందిన మహేందర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, పక్కన మహేందర్ తదితరులు

ఇల్లెందు : గత పదేళ్ల కేసీఆర్ పాలనపై ఇల్లెందు సంజయ్‌నగర్‌కు చెందిన తోటకూర మహేందర్ ‘ప్రజాయోధుడు’ శీర్షికన 220 పేజీల పుస్తకాన్ని రచించగా.. హైదరాబాద్‌లో శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. మహేందర్ ఉన్నత చదువు పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటూ గ్రూప్ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. ఈ క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఎలా ఉండేది, ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎలా అభివృద్ధి సాధించిందనే వివరాలను సోదాహరణంగా పుస్తకంలో పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణను ఎలా వక్రీకరిస్తున్నారనే అంశాలను వివరంగా వెల్లడించారు. ఈ పుస్తకంలో కేసీఆర్ జననం, బాల్యం, రాజకీయ రంగప్రవేశం, రెండో దశ తెలంగాణ ఉద్యమం, టీఆర్ఎస్ ఆవిర్భావం, సీఎంగా కేసీఆర్ పాలన, తెలంగాణ అభివృద్ధి తదితర విషయాలు పొందుపరిచారు.

కాగా, మహేందర్‌ను దిండిగాల రాజేందర్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రరెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం నుంచి ఖమ్మంలో జిల్లాలో మొదలయ్యే మంత్రి పర్యటన కూసుమంచి, నేలకొండపల్లి మండలాలతో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మంలో కొనసాగుతుంది. ఆతర్వాత సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు, లక్ష్మీదేవిపల్లి మండలు, కొత్తగూడెం కార్పొరేషన్లలో జరిగే పలు ప్రైవేట్ కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.

జిల్లా జట్టుకు 20 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

పాల్వంచరూరల్: ఈనెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–15 వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి హాజరయ్యేందుకు 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ తెలిపారు. మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలలో శనివారం క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు పుణెలో జరిగే జాతీయ పోటీలకు, అక్కడ ప్రతిభ చాటిన వారు చైనాలో జరిగే అంతర్జాతీయస్థాయి పోటీల్లో భారత్ జట్టు తరఫున పాల్గొంటారని వివరించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో బాలికల విభాగంలో నందమ్మ, వర్షిత, మస్రేక, ప్రసన్న, శ్రీలక్ష్మి, లాస్యభారతి, మేఘహర్ష, నందు, స్టాండ్‌బైగా వైశాలి, జనన్యశ్రీ ఉన్నారని, బాలుర విభాగంలో బుర్ర లోకేష్, విష్ణువర్ధన్, రిషివర్మ, రాజు, వెంకన్నబాబు, వినయ్ కుమార్, లోకేష్, సందీప్, స్టాండ్‌బైగా సంతోష్, హర్షవర్ధన్‌ను ఎంపిక చేశామని వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, వెంకటనారాయణ, కవిత, కృష్ణ, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, సుజాత, సీత పాల్గొన్నారు.

ఆస్పత్రికి ముందస్తుగా గర్భిణి తరలింపు

అటవీ ప్రాంతంలో రహదారి సౌకర్యం లేనందునే..


గర్భిణిని వైద్యశాలకు తరలిస్తున్న వైద్యాధికారులు

చర్ల: మండలంలోని ఆదివాసీ గ్రామమైన వీరాపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణిని వైద్యాధికారులు శనివారం ముందస్తుగా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సరైన రహదారి సౌకర్యం లేని గ్రామాలకు చెందిన గర్భిణులను.. వర్షాల నేపథ్యంలో ముందుగానే గుర్తించి డెలివరీ కోసం తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది వీరాపురం వెళ్లి గర్భిణి లక్కీని 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ద్విచక్రవాహనాల చోరీ కేసులో అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరు పోలీసులకు చిక్కారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి.. లక్ష్మీదేవిపల్లి రైతు వేదిక వద్ద రోడ్డుపై ఎస్‌ఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనాలపై బొమ్మనపల్లి వైపు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారణ చేపట్టారు. దీంతో కొత్తగూడెంలోని న్యూ గొల్లగూడేనికి చెందిన సైకిల్ మెకానిక్ భీమవరపు యువరాజ్, ఏపీ రాష్ట్రంలోని హేమచంద్రాపురానికి చెందిన కంచర్ల అరవింద్‌రెడ్డి ఇద్దరూ కలిసి సూర్యాపేట జిల్లా కోదాడలో పల్సర్ మోటార్ సైకిల్, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామారంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

చింతకాని: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రైతు ధర్మపురి పుల్లారావు ట్రాక్టర్ ట్రక్కు చోరీకి గురైంది. రైతు ఏడాది క్రితం ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు కొనుగోలు చేయగా, ప్రొద్దుటూరులో స్నేహితుడైన పాసంగులపాటి విష్ణువర్ధన్ అవసరాలకు శుక్రవారం పంపించాడు. ఆయన ఇంటి వద్ద శుక్రవారం రాత్రి ట్రక్కు చోరీ కావడంతో శనివారం పుల్లారావుకు సమాచారం ఇచ్చాడు. దీంతో రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052


మత్తడి పడుతున్న ఇల్లెందులపాడు చెరువు


ఇల్లెందు మండలం సీతానగరం వద్ద నీట మునిగిన పొలాలు


గుండాల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లన్న వాగు

ఉప్పొంగిన వాగులు..

- రహదారులపైకి వరద ప్రవాహం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఇల్లెందు/ఇల్లెందురూరల్/గుండాల/జూలూరుపాడు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండగా.. కొన్ని చోట్ల వరద నీరు రహదారులపైకి పోటెత్తింది. ఈ క్రమంలో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇల్లెందు పట్టణానికి తాగునీరు అందించే ఇల్లెందులపాడు చెరువు అలుగుపోసి ప్రవహిస్తుండగా సత్యనారాయణపురం గ్రామానికి రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. బుగ్గవాగు లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. పట్టణంలోని బర్లపెంట ఏరియాలోని రెండులో లెవల్ కాజ్‌వేలు పొంగి కల్వర్టు మీదుగా నీరు ప్రవహించగా నంబర్ – 2 బస్తీ, ఎల్‌బీఎస్ నగర్‌లకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారులంతా అలర్ట్‌గా ఉండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఇల్లెందు మండలంలోని మస్సివాగు, బుగ్గవాగు ఉధృతంగా ప్రవహించడంతో పంటలు నీట మునిగాయి. ఇల్లెందు –మహబూబాబాద్ ప్రధాన రహదారిపై జెండాల వాగు వద్ద వరదనీరు రోడ్డు మీదుగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోచారంతండా, రాఘబోయినగూడెం, కొమ్ముగూడెం తదితర గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని కిన్నెరసాని, మల్లన్న వాగు, ఏడుమెలికల వాగు, జల్లేరు, దున్నపోతుల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో నాగారం, దొంగతోగు, పాలగూడెం, కొడవటంచ, అడవిరామారం, సీతానగరం, రాయిగూడెం గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. జూలూరుపాడుమండలంలో ప్రధానమైన పెద్దవాగు, తుమ్మలవాగు, ఎదళ్లవాగులు ఉప్పొంగడంతో 21 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భేతాళపాడు – పడమటనర్సాపురం గ్రామాల మధ్య గల పెద్దవాగు, తుమ్మలవాగు ఉధృతితో బ్రిడ్జిలపై నుంచి వరదనీరు పొంగి ప్రవహించింది. గుండ్లరేవు – అన్నారుపాడు అనంతారం – కాకర్ల, కాకర్ల – దుబ్బతండా, మాచినేనిపేట – వాగొడ్డుతండా మధ్య గల వాగులు పోటెత్తాయి. దీంతో అధికారులు వాగుల వద్ద ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి ప్రజలు దాటకుండా చర్యలు చేపట్టారు.


ఇల్లెందు – సత్యనారాయణపురం మధ్య పొంగుతున్న అలుగు వాగు


పడమటనర్సాపురం – భేతాళపాడు మధ్య ఉప్పొంగి ప్రవహిస్తున్న తుమ్మలవాగు


ఇల్లెందు – మహబూబాబాద్ ప్రధాన రహదారిపై బారులుదీరిన వాహనాలు

అధిక వర్షం.. పంటలు ఆగం

టేకులపల్లి: అధికవర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. మండల పరిధిలో ప్రస్తుత సీజన్‌కు గాను వరి 5,600 ఎకరాలు, పత్తి 33వేల ఎకరాలు, మొక్కజొన్న 12,500, మిర్చి 1,500 ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవల అధిక వర్షాలు కురుస్తుండగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలు నీటిలో మునిగిపోయాయి. రోళ్లపాడు, రుక్మాతండా, బేతంపూడి తదితర గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


రోళ్లపాడులో ఇసుక మేటలతో కుళ్లిపోయిన పత్తి చెట్లు

మొదటి హెచ్చరిక దిశగా..

- మున్నేటికి కాల్వొడ్డు వద్ద 15అడుగుల నీటిమట్టం
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరద మున్నేటికి పోటెత్తింది. ఈ ఏడాది తొలిసారి కాల్వొడ్డు వద్ద 15అడుగులకు పైగా వరద ప్రవహించింది. శనివా రం ఉదయం 9.5 అడుగులుగా ఉన్న నీటిమట్టం అంతకంతకూ పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 15 అడుగులకు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక్కడ నీటిమట్టం 16అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

అధికారుల పరిశీలన

మున్నేటికి వరద ఉధృతి పెరుగుతుండడంతో మధ్యాహ్నం 12గంటల సమయాన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కాల్వొడ్డు వద్ద పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రత్యేక అధికారులు, వార్డు ఆఫీసర్లు స్థానికంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేసేలా ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రం 4.30గంటలకు నీటిమట్టం 14.5 అడుగులకు చేరగా లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేలా విలువైన వస్తువులు భద్రపరుచుకోవాలని ప్రచారం చేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డితో కలిసి మున్నేటికి ఇరువైపులా పరిశీలించి కార్పొరేటర్లు, ప్రజలు, అధికారులతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు రాగానే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వరద పెరుగుతున్న నేపథ్యాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలు చేశారు. అలాగే, అలాగే, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు మున్నేటి పరీవాహకంలో పర్యవేక్షించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్, ఎస్‌ఈ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లే కాక అర్బన్, రూరల్ తహసీల్దార్లు, త్రీటౌన్ సీఐ, ఇరిగేషన్ అధికారులు ముంపు ప్రాంతాల్లో కలియదిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేశారు. కార్పొరేటర్లు తోట గోవిందమ్మ రామారావు తదితరులు కూడా అధికారుల సూచనలు పాటించాలని, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందుగానే అప్రమత్తం కావాలని ప్రజలకు అవగాహన కల్పించారు.


మున్నేటి వరదను పరిశీలిస్తున్న నాయకులు, బొక్కలగడ్డ వాసులు

పునరావాస కేంద్రాలు సిద్ధం..

శనివారం రాత్రి మున్నేటి వరద 17అడుగుల వరకు చేరే అవకాశముందన్న సమాచారంతో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇదే సమయాన పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ప్రజలను తరలించాల్సి వస్తే అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలిదఫా నయాబజార్ జూనియర్ కళాశాల, రామన్నపేట స్కూళ్లలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఉంచారు.

మత ఫాసిజాన్ని ప్రతిఘటిస్తేనే వ్యవస్థల పరిరక్షణ

నాస్తిక సమాజ అధ్యయన తరగతుల్లో వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో పెరుగుతున్న మత ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడి లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలు, ప్రజాస్వామ్యవాదులపై ఉందని రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన నాస్తిక సమాజ, అధ్యయన తరగతుల్లో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు దేశ పరిస్థితినే కాక ప్రపంచ పరిస్థితులను అధ్యయనం చేస్తూ పోరాట పంథా రూపొందించుకోవాలని సూచించారు. భావమే ప్రధానంగా భావించిన వారు భావవాదులుగా, పదార్థమే ప్రధానంగా భావించిన వారు భౌతిక వాదులుగా విభజించబడ్డారని చెప్పారు. అయితే, భౌతికవాదమే అన్ని సమస్యలకు పరిష్కారాన్ని చూపించనుండగా, భావవాదం సమస్యల్ని ఇంకా పెంచుతుందని తెలిపారు. దీన్ని గుర్తించిన పాలక వర్గం ప్రజలను మత్తులో ఉంచడానికి మతం, దేవుళ్లను వాడుకుంటోందని వెల్లడించారు. ఈ విషయాన్ని గమనించి ఎవరికివారు తమను తాము ప్రశ్నించుకుంటే విజ్ఞానం వెల్లివిరుస్తుందని విజయ్‌కుమార్ తెలిపారు. అనంతరం 'శాస్త్రీయ దృక్పథం' అంశంపై సీహెచ్.రమేష్, 'వాస్తవాల ఆధారంగా జీవించడం ఎలా?' అన్న అంశంపై బీ.వీ.రాఘవులు మాట్లాడారు. సామాజిక సంబంధమైన విషయాల్లో సత్యాలను బోధించే ఏకైక శాస్త్రం మార్క్సిజం అని పేర్కొన్నారు. ఈ తరగతులకు ఆవుల అశోక్, ప్రీతం అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా కన్నెబోయిన అంజయ్య, కోటేశ్వరరావు, చార్వాక, సుధాకర్, క్రాంతి, స్టాలిన్, ఝాన్సీ, శోభ తదితరులు పాల్గొన్నారు.


అధ్యయన తరగతుల్లో మాట్లాడుతున్న రమేష్

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి

కోల్ మూమెంట్ ఈడీ వెంకన్న

మణుగూరు టౌన్: నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి పటిష్ట చర్యలు చేపట్టాలని కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ వెంకన్న అన్నారు. శనివారం ఆయన మణుగూరు ఏరియాలో జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి ఓసీ–2, ఓసీ–4 వద్ద జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. కేసీహెచ్‌పీ బంకర్‌లో రవాణా అవుతున్న బొగ్గు నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 115 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని సాధించేందుకు కార్మికులు, సూపర్‌వైజర్లు సమష్టిగా కృషి చేయాలని, రక్షణతో పనిచేస్తూ అధికోత్పత్తికి పాటుపడాలని అన్నారు. సింగరేణి కంటే కోల్ ఇండియాలో తక్కువ ధరకు బొగ్గు లభిస్తున్నందున సింగరేణి బొగ్గును తీసుకోవడానికి వినియోగదారులు ఆసక్తి చూపడం లేదన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసి వినియోగదారులకు తక్కువ ధరకు రవాణా చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగులంతా 8 గంటల సమయాన్ని పూర్తిస్థాయిలో పనిచేస్తూ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేపీయూజీ మైన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సమావేశంలో క్వాలిటీ జీఎం వెంకటరమణ, ఎస్‌ఓటు జీఎం శ్రీనివాసాచారి, అధికారులు వీరభద్రరావు, చంద్రశేఖర్, రాంబాబు, వీరభద్రుడు, రమేశ్, సురేందర్‌రాజు, శివ ప్రసాద్, మదన్‌నాయక్, అనురాధ, సౌరభ్ సుమన్, బైరెడ్డి వెంకటేశ్వర్లు, నాగ రమేశ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.


కేసీహెచ్‌పీ వద్ద బొగ్గు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

108 వాహనంలో ప్రసవం

తల్లీ, బిడ్డ క్షేమం

బూర్గంపాడు: మండల పరిధిలోని రాంపురం కేసీఆర్ కాలనీకి చెందిన సీహెచ్ స్వప్నకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శనివారం ఉదయం 7 గంటలకు మోరంపల్లి బంజర పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు ఆమెకు సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నించారు. అయితే నొప్పులు ఎక్కువ కావడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశా రు. దీంతో ఆమెను 108 వాహనంలో భద్రాచలం తరలిస్తుండగా మధ్యలోనే నొప్పులు తీవ్రమయ్యాయి. 108 పైలట్ విజయ భాస్కర్ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలపగా ఈఎంటీ సుభద్ర స్వప్నకు పురుడుపోసింది. స్వప్న మూడో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ అయిన తక్షణమే తల్లీబిడ్డను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారిని పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా సుభద్ర, విజయభాస్కర్‌ను ఏరియా ఆస్పత్రి వైద్యులు అభినందించారు.


బిడ్డను స్వప్న బంధువుకు అప్పగిస్తున్న సిబ్బంది

ఆర్‌అండ్‌బీ రహదారిపై రోడ్లు వేసి నిరసన

బూర్గంపాడు: మండలంలోని సారపాక నుంచి ఇరవెండి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి దెబ్బతిని గుంతలు తేలగా.. వర్షానికి నీరు నిలిచి స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈమేరకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రహదారిపై గుంతల్లో నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతు రహదారి సమస్యను ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఇకనైనా కనీస మరమ్మతులు చేయించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాపినేని సరోజని, ఎస్కే అబీదా, కొలురి నాగమణి, స్వరూప, ఐశ్వర్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికి అంతుపట్టని తెగులు

పాల్వంచరూరల్: ఇప్పుడిప్పుడే ఏపుగా ఎదుగుతున్న పత్తి పంటకు గుర్తుతెలియని తెగులు వ్యాపించడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. మండలంలోని కోడిపుంజులవాగుకు చెందిన భూక్యా రవి ఐదెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. ప్రస్తుతం చెట్లు ఏపుగా పెరుగుతున్నా ఇగురు, చిగురు రావడంలేదు. వచ్చిన ఆకులు సైతం ముడుచుకుపోగా నాలుగు సార్లు మందులు వాడినా ఫలితం లేదని రవి వెల్లడించాడు. పాల్వంచలోని డీలర్ వద్ద పత్తి విత్తనాలు కొనుగోలు చేయగా.. విత్తన లోపంతోనే ఇలా జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. కాగా, వైరస్ మాదిరి ఒక చెట్టు నుంచి ఇంకో చెట్టుకు తెగులు వ్యాపించగా ఐదు ఎకరాల్లో పత్తి మొక్కలన్నీ ఇలాగే మారాయని వాపోయాడు.


పత్తి మొక్కలు చూపిస్తున్న రైతు రవి

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

సుజాతనగర్: ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్త అంజనాపురంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా పంచాయతీ పరిధిలోని కోటల్ల గ్రామానికి చెందిన ఈసాల ప్రభాకర్ (39) అప్పుడప్పుడూ ఆటోనడుపుతూ ఖాళీసమయంలో తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పాత అంజనాపురం గ్రామానికి చెందిన అతడి బావ జబ్బా బాలకృష్ణ ఇంట్లో తాపీ పని చేసేందుకు శనివారం వచ్చాడు. పాత ఇంటి స్లాబ్‌ను కూలగొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తూ పైనుంచి కిందపడిపోయాడు. ఆ వెంటనే స్లాబు లోని కొంతభాగం కూలి అతడిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు.


ప్రభాకర్(ఫైల్)

ఏడుబావుల వద్ద యువకుడి గల్లంతు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల వద్ద శనివారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం ఎస్టీ కాలనీకి చెందిన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్ తన బంధువులు, స్నేహితులతో కలిసి ఏడుబావుల జలపాతం చూసేందుకు వచ్చాడు. జలపాతం వద్ద పైన ఉన్న బావులను చూసేందుకు వెళ్తున్న క్రమాన ప్రేమ్ ప్రమాదవశాత్తు జారి బావిలో పడినట్లు తెలుస్తోంది. ఆయన సహచరులు ఎంత గాలించినా ప్రేమ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. ఇంతలోనే చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది.